క్లుప్తంగా

11న లబ్ధిదారుల ఎంపిక

మహబూబాబాద్: 2022–23 సంవత్సరానికి ముస్లిం మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారిలో లబ్ధిదారుల ఎంపిక ఈనెల 11న నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ టి.ప్రసన్నరాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయం హాల్‌లో ఉదయం 11గంటలకు డ్రా పద్ధతిన ఎంపిక చేయడం జరుగుతుందని, సకాలంలో హాజరుకావాలని కోరారు.

నిధుల కేటాయింపు



డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్ సమస్యల పరిష్కారం, మెరుగైన విద్యుత్ సరఫరా, వసతుల కోసం కోటి రూపాయల నిధులు కేటాయిస్తున్నామని మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న తెలిపారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో శుక్రవారం విద్యుత్‌శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో చైర్మన్ వీరన్న మాట్లాడుతూ.. త్రీఫేజ్ విద్యుత్ సరఫరా, మిడిల్ పోల్స్ ఏర్పాటు, పోల్స్ షిఫ్టింగ్ తదితర పనులతోపాటు భవిష్యత్ అవసరాల కోసం చేయాల్సిన ఏర్పాట్ల కోసం నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. వార్డులలో విద్యుత్ సమస్యలు, ఏర్పాటు చేయాల్సిన వసతుల గురించి ప్రజలు తమను సంప్రదించాలని చైర్మన్ వీరన్న కోరారు. సమావేశంలో విద్యుత్ శాఖ ఏడీఈ రమేష్, ఏఈ కిరణ్, లైన్ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

భూమి పూజ

కురవి: మండలంలోని నారాయణపురం గ్రామంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠ కోసం జెడ్పీటీసీ బండి వెంకటరెడ్డి శుక్రవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో వాసు రాజు, వివేక్‌వర్మ, వీరన్న, రవి, శ్రీకాంత్, సుధాకర్, అశోక్, నాగరాజు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

12రకాల సరుకులు పంపిణీ చేయాలి

నెహ్రూసెంటర్: రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ షాపుల ద్వారా పేద ప్రజలకు 12రకాల సరుకులు ఉచితంగా పంపిణీ చేయాలని పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పైండ్ల యాకయ్య అన్నారు. రాయితీలు కార్పొరేట్లకు కాదు, పేదలకు ఇవ్వండి అనే వాల్‌పోస్టర్‌ను శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా యాకయ్య మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్కొక్కరికి 5 కేజీల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో కందాల రంగయ్య, ప్రవీణ్, వెంకన్న, యాకన్న తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



తొర్రూరు రూరల్: ప్రతి ఒక్కరూ సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని లయన్స్ క్లబ్ ఆఫ్ టీచర్స్ ఛార్టర్ అధ్యక్షుడు సూరం ఉపేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మాటేడులో లయన్స్‌క్లబ్ ఆఫ్ టీచర్స్ ఆధ్వర్యంలో సర్పంచ్ వల్లపు శోభతో కలిసి పంచాయతీ సిబ్బందికి దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పినాకపాణి, టీచర్స్ అధ్యక్షుడు రాయిపెల్లి యాకయ్య, ప్రతినిధులు సురేష్, శ్రీనివాస్‌రెడ్డి, వేణుమాధవ్‌రెడ్డి, బాతుక బుచ్చిరాములు పాల్గొన్నారు.

అంబోతుకు ప్రత్యేక పూజలు

డోర్నకల్: మండలంలోని పెరుమాళ్ల సంకీస గ్రామంలో గ్రామపంచాయతీకి కేటాయించిన అంబోతుకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన బడేటి మధుమూర్తి, విజయలక్ష్మి దంపతులు తమ దూడకు గ్రామపంచాయతీ అంబోతు కోసం అందించగా గ్రామస్తులతోపాటు మధు దంపతులు అంబోతుకు ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామంలో విడిచిపెట్టారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించాలి



నెల్లికుదురు: అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు పరిరక్షించాలని సీపీఎం మండల కార్యదర్శి పెరుమాండ్ల తిలక్ బాబు కోరారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమిలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో 317 సర్వే నంబర్‌లో గుడిసెలు నిర్మించే ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి ఇస్సంపల్లి సైదులు, తోట నర్సయ్య, పుల్లయ్య, భిక్షపతి, వీరేంకులు, భిక్షపతి, ఉప్పలయ్య, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులరైజేషన్ అయ్యేనా ?

- 3 సంవత్సరాల ప్రొబేషనరీ కాలంతో విధుల్లో చేరిన జేపీఎస్‌లు
- ఈనెల 11తో ముగియనున్న పెంచిన గడువు
- పని భారంతోపాటు యాప్‌లతో సతమతం
- సక్రమంగా విడుదల కాని వేతనాలు
- స్పందించకపోతే ఆందోళనకు సిద్ధం



మంత్రి దయాకర్‌రావును కలిసి సమస్యను వివరిస్తున్న ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు(ఫైల్)

మహబూబాబాద్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు రెగ్యులరైజేషన్ (క్రమబద్ధీకరణ) కోసం ఎదురు చూస్తున్నారు. మూడు సంవత్సరాల ప్రొబిషనరీ కాలం ముగిసిన తర్వాత సీఎం కేసీఆర్ మరో ఏడాది కాలం పెంచారు. అది ఈనెల 11తో ముగుస్తుంది. ఉద్యోగ భద్రత లేక ఆపై పనిభారం యాప్‌లతో సతమతమవుతున్నారు. దానికి తోడు నెలనెలా వేతనాలు సక్రమంగా రాక నానా తంటాలు పడుతున్నారు. రెగ్యులరైజేషన్ గురించి ప్రకటన విడుదల చేయకపోతే భవిష్యత్ కార్యాచరణతో ముందుకు పోతామని వారు అంటున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్‌పంచాయతీ కార్యదర్శుల పరీక్ష ద్వారా 9,355 మంది విధుల్లోకి తీసుకున్నారు. ప్రొబిషనరీ పిరియడ్ పూర్తి అయ్యింది. ఆ విషయంలో తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ కమిటీ ఆధ్వర్యంలో సంబంధిత మంత్రితోపాటు ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్‌కుమార్‌సుల్తానియాకి వినతులు ఇచ్చారు. వేతనం రూ.15,000 ఉండగా రూ 28,719 పెంచారు. వేతనం పెంచారు కాని రెగ్యులరైజేషన్ చేయలేదు. మానుకోట జిల్లాలో 461 గ్రామపంచాయతీలు ఉండగా 80 మంది సీనియర్ పంచాయతీ కార్యదర్శులు పని చేస్తుండగా 370 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, అవుట్ సోర్సింగ్‌లో మరో 11 మందిని తీసుకున్నారు

ప్రకటించకపోతే ఆందోళన బాట



ఈనెల 6న మంత్రి దయాకర్‌రావుకు, శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్‌కుమార్ సుల్తానియాకు వినతి ఇచ్చాం. ఈనెల 11 ప్రభుత్వం ఆ విషయంలో స్పందించి ప్రకటించకపోతే భవిష్యత్ కార్యచరణతో ముందుకు పోతాం. ఆందోళన కార్యక్రమాలు చేపడతాం. ప్రభుత్వం స్పందిస్తుందని ఆశిస్తున్నాం. - శ్రీకాంత్ గౌడ్, ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

పెరిగిన పని భారం..

ఇంటి పన్ను వసూళ్లు, పారిశుద్ధ్య నిర్వహన, వీధి దీపాల నిర్వహన, తాగునీరు సరఫరాతోపాటు 36 రకాల రికార్డుల నిర్వహన ఇతారత్రా పనులతో పాటు అదనంగా ఫివర్ సర్వే, ఆర్‌ఓఎఫ్‌ఆర్ సర్వే, బీఎల్‌ఓల విధులు చేస్తున్నారు. పీఎస్ డీఎస్‌ఆర్ యాప్, పల్లెప్రగతి యాప్, మిషన్ అంత్యోదయ యాప్, జీపీ డీపీఆర్ తోపాటు పలు యాప్‌ల భారం మోపారు.

ఆదర్శ మున్సిపాలిటీగా మార్చేందుకు కృషి

- ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మహబూబాబాద్: ఆదర్శ మున్సిపాలిటీగా మార్చేందుకు కృషి చేస్తున్నానని, ఇప్పటికే మానుకోట మున్సిపాలిటీ పరిధిలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు జరిగి మానుకోట రూపురేఖలు మారాయని ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని 23, 25, 26 వార్డులతోపాటు పలు వార్డులో శుక్రవారం ఎమ్మెల్యే పర్యటించి ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం 25వ వార్డులో రూ. 18.99 లక్షలతో, 19 వార్డులో రూ.5లక్షల వ్యయంతో నిర్మాణం చేసే సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మానుకోట మున్సిపాలిటీ అభివృద్ధికి సీఎం కేసీఆర్ రూ.50 కోట్లు విడుదల చేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి , వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్, కౌన్సిలర్లు వెంకన్న, జనార్దన్, శ్రీదేవి, ఫరీదా, స్వాతి, ఏఈ సురేష్, నాయకులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం



కాగడాల ప్రదర్శన చేస్తున్న రాములునాయక్, తదితరులు

మహబూబాబాద్ రూరల్: పేపర్ లీకేజీలతో ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని వైఎస్సార్ టీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ గుగులోత్ రాములునాయక్ అన్నారు. తెలంగాణలో జరుగుతున్న పేపర్ లీకేజీలను వ్యతిరేకిస్తూ మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురం గ్రామ శివారు బోడ తండాలో శుక్రవారం రాత్రి వైఎస్సార్ టీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ గుగులోత్ రాములునాయక్ ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించే గొంతుగా వైఎస్సార్ టీపీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ఇచ్చిన పిలుపు మేరకు నిరసన చేపట్టామని తెలిపారు.

కేసీఆర్‌ను మూడోసారి సీఎం చేద్దాం

- ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

కురవి: సీఎం కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేద్దామని, అందుకోసం డోర్నకల్ నియోజకవర్గ ప్రజలు ఆదరించి గెలిపించాలని ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. శుక్రవారం సీరోలు మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన వారిని కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గంలో పెద్ద పాలేరుగా పనిచేస్తున్నానన్నారు. సీరోలును మండలం చేస్తానని ఇచ్చిన హామీని నెరవేర్చడం జరిగిందని తెలిపారు. సీరోలు మండల ప్రజలు ఆశీర్వదించాలని తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ టెన్త్ పేపర్‌లను లీకేజీ చేయించడం దారుణమన్నారు. బండి సంజయ్ వాడే భాష అధ్వానంగా ఉందని, సంజయ్ భాషను మార్చుకోవాలని హితవుపలికారు. కాంగ్రెస్ పరిస్థితి దయనీయంగా ఉందని ఎద్దేవా చేశారు. ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన కార్యకర్తలు, నాయకులకు భోజనం ఏర్పాటు చేశారు. వండిన వంటల వద్దకు ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ వెళ్లి మటన్ కూరను రుచి చూశారు. ఆత్మీయ సమ్మేళనం ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, మాజీ ఎమ్మెల్సీ వి.వెంకటరెడ్డి, యూత్ నియోజకవర్గ నేత డీఎస్ రవిచంద్ర, ఎంపీపీలు గుగులోత్ పద్మావతి రవినాయక్, బాలునాయక్, డోర్నకల్ జెడ్పీటీసీ కమలరామనాథం తదితరులు పాల్గొన్నారు.

10నుంచి కేవీపీఎస్ సందేశ్ యాత్ర

నెహ్రూసెంటర్: మహనీయుల జయంతులను పురస్కరించుకుని ఈనెల 10నుంచి 30వరకు జరిగే పూలే, అంబేద్కర్ సందేశ్ యాత్రలు నిర్వహిస్తున్నామని కుల వివక్షణ పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డెల రాంమూర్తి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 11, 14వ తేదీలలో మహనీయుల జయంతుల సందర్భంగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి యాకుబ్, దర్గయ్య, యాకయ్య, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమ పనులను అడ్డుకున్న గ్రామస్తులు



గ్రామస్తులకు సర్ది చెబుతున్న పోలీసులు

డోర్నకల్: మండలంలోని తొడేళ్లగూడెం గ్రామ సమీపంలో మిరపనూనె తయారీ పరిశ్రమ నిర్మాణ పనులను శుక్రవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. తమ గ్రామ సమీపంలో ఏర్పాటు చేస్తున్న మిరప నూనె తయారీ పరిశ్రమతో గ్రామస్తులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలు ఉన్నందున పరిశ్రమ ఏర్పాటును అంగీకరించబోమంటూ నిర్మాణ పనులు జరుగుతున్న ప్రదేశంలో ఆందోళనకు దిగారు. డోర్నకల్ సీఐ వెంకటరత్నం ఘటనా స్థలానికి చేరుకుని అన్నిరకాల అనుమతులతో నిర్మాణ పనులు ప్రారంభించారని, పనులు అడ్డుకోకుండా న్యాయపరంగా వెళ్లాలని గ్రామస్తులకు సర్దిచెప్పి అక్కడి నుంచి పంపించారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

- ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

గార్ల: నిరుపేదల అభ్యున్నతే కేసీఆర్ ప్రభుత్వ ధ్యేయం అని ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అన్నారు. శుక్రవారం మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన బాలాజీతండాలో రూ.25లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. బాలాజీతండా నుంచి మంగలితండా వరకు బీటీ రహదారి నిర్మాణం చేపడతామని మాదారం స్టీల్ ఫ్యాక్టరీ జీఎం హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, ఎంపీపీ ఎం శివాజీచౌహాన్, సర్పంచ్‌లు ఆర్ శంకర్, మోతీలాల్, ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్, మండల కార్యదర్శి పి రాధాకృష్ణ, ఉపాధ్యక్షుడు బుడిగ మురళి, లింగాల ఉమేష్ తదితరులు పాల్గొన్నారు. బాలాజీతండాలో సీసీ రోడ్డు నిర్మాణ పనుల వద్ద ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ సరదాగా కాసేపు జేసీబీని నడిపి మట్టిని తీసి ట్రాక్టర్‌లో లోడ్ చేశారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

గుడ్ ఫ్రైడే వేడుకలను చర్చిల్లో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రభువైన ఏసు ప్రజలందరిని రక్షించడానికి, పాపులను క్షమించడానికి ఈ భూమిపైకి వచ్చాడని పాస్టేట్ చైర్మన్ రెవరెండ్ ఫాదర్ జీజే కాంతారావు అన్నారు. - సాక్షి నెట్‌వర్క్



కేసముద్రం: ఆగాపే గాస్పల్ చర్చిలో గుడ్ ఫ్రైడే వేడుకలు



దోర్నకల్‌లో గుడ్ ఫ్రైడే ర్యాలీ



గార్ల: శిలువతో ప్రదర్శన..





మహబూబాబాద్ రూరల్: సీఎస్ఐ చర్చిలో ప్రసంగిస్తున్న రెవరెండ్ ఫాదర్ జీజే కాంతారావు, ప్రార్థనలో పాల్గొన్న క్రీస్తు ఆరాధకులు

'విద్యలో మితిమీరిన రాజకీయ జోక్యం'



మాట్లాడుతున్న కవిత

మహబూబాబాద్ అర్బన్: పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహనలోకి కూడా రాజకీయాలు చొచ్చుకొని రావడం తీవ్ర ఆందోళన కలిగిస్తుందని టపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సిద్ధోజు కవిత అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం మాట్లాడుతూ.. విద్యలో మితిమీరిన రాజకీయ జోక్యం, తిరోగమన విధానాలపై చర్చించడానికి తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా సదస్సు టీపీటీఎఫ్ కార్యాలయంలో ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నామన్నారు. విద్యా పరిరక్షణ కమిటీ కార్య నిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ ముఖ్యవక్తగా హాజరవుతారన్నారని, సదస్సుకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు చుంచు శ్రీశైలం, డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కర్, కృష్ణమూర్తి, నాయకులు విష్ణువర్ధన్, లక్ష్మయ్య, భీముడు, సురేందర్, ఉపేందర్, విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

మాలలు రాజకీయంగా ఎదగాలి



మాట్లాడుతున్న జిల్లా నాయకులు

గూడూరు: మాలలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గుగ్రాల లింగయ్య, ప్రధాన కార్యదర్శి బెజ్జం రమేష్ కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం మండల మాల మహానాడు అధ్యక్షుడు చీదురు హరీశ్ అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 11న నెల్లికుదురు మండల కేంద్రంలోని అమూల్య గార్డెన్స్‌లో మాలల ఆత్మగౌరవ సమ్మేళనం సభ జరుగుతుందని తెలిపారు. మాలలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు యాకాంతం, వీరన్న, వెంకన్న, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

వారోత్సవాలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఉపేందర్

నెహ్రూసెంటర్: సామాజిక న్యాయ వారోత్సవాలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ అన్నారు. సీఐటీయూ జిల్లా కమిటీ సమావేశం సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు అధ్యక్షతన సంఘ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా కుంట ఉపేందర్ మాట్లాడుతూ.. సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు బిటి రణదీవే వర్ధంతి ఈనెల 6వ తేదీ నుంచి ఈ నెల 14వ తేదీ అంబేడ్కర్ జయంతి వరకు సామాజిక న్యాయ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వారోత్సవాల్లో కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సమ్మెట రాజమౌళి, నాగన్న, మౌనిక, సరోజ, మల్లేష్, వెంకన్న, ఉప్పలయ్య, శ్రీను సుధాకర్, స్నేహబిందు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

క్వింటా బియ్యం అందజేత

కేసముద్రం: మండలంలోని పెనుగొండ గ్రామానికి చెందిన ఉడుగుల ప్రభావతి అనే మహిళ ఇటీవల మృతిచెందింది. ఈ మేరకు మృతురాలి కుటుంబానికి సమ్మిగౌడ్ ఫౌండేషన్ చైర్మన్ చిలువేరు సమ్మయ్యగౌడ్ శుక్రవారం క్వింటా బియ్యం అందజేశారు. కార్యక్రమంలో రైతుబంధుసమితి మండల కోఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్, ఎంపీటీసీ వెంకన్న, ఉపసర్పంచ్ షేక్ బాలుషాహిద్ పాల్గొన్నారు.

మొక్కలను కాపాడుకోవాలి

మరిపెడ రూరల్: వేసవి తాపం నుంచి ప్రధాన రహదారుల్లో నాటిన అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలను కాపాడుకోవాలని ఏపీఓ మంగమ్మ అన్నారు. మరిపెడ మండలం అబ్బాయిపాలెం ప్రధాన రహదారిలో అవెన్యూ ప్లాంటేషన్‌కు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నీటిని శుక్రవారం జీపీ ట్రాక్టర్ ట్యాంకర్‌తో పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జినుక మణిఇద్దయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ రాయల రవి, కారోబార్ యాదగిరి, సిబ్బంది పాల్గొన్నారు.

బలగం సినిమా ప్రదర్శన

కేసముద్రం: మండలంలోని గాంధీపురం జీపీ శివారు వెంకట్రాంతండాలో బలగం సినిమాను గురువారం రాత్రి ప్రదర్శించారు. తండాకు చెందిన భుక్యా రాంచంద్రునాయక్ మాట్లాడుతూ.. సంస్కృతి సంప్రదాయాలు చూపిన బలగం సినిమాను తండాలో ప్రదర్శించినట్లు తెలిపారు.

సన్మానం

మరిపెడ: తొర్రూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నియమితులైన మరిపెడకు చెందిన బానోతు లాలును ముస్లిం సోదరులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ లతీఫ్, జహంగీర్, హఫీజ్, యాకూబ్‌పాష, ఫైజ్‌ఖాన్ పాల్గొన్నారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని ఓ గ్రామంలో ఒకరు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. ఈ విషయమై రూరల్ పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

మాజీ సర్పంచ్ మృతి

నర్సింహులపేట: నర్సింహులపేట మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్, రాజకీయ వృద్ధుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జినుకుల భిక్షం కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. 2001నుంచి 2006 వరకు నర్సింహులపేట సర్పంచ్‌గా పనిచేశాడు. పలువురు నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

కౌన్సెలింగ్

కేసముద్రం: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్స్‌కు, మహబూబాబాద్ రూరల్ సీఐ బానోత్ రమేష్ శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా ఉండాలని, లేనిఎడల చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కోగిల తిరుపతి, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.


మోదీ పర్యటనను విజయవంతం చేయాలి

పెద్దవంగర: నేడు హైదరాబాద్‌కు వస్తున్న ప్రధాని మోదీ పర్యటనను విజయవంతం చేసేందుకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములు గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సుధాకర్, సోమయ్య, రవి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పెద్దచెరువు అభివృద్ధిపై నిర్లక్ష్యం

బయ్యారం: కాకతీయులకాలంలో నిర్మించిన బయ్యారం పెద్దచెరువు అభివృద్ధిపై పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు కొత్త వినయ్‌బాబు అన్నారు.
శుక్రవారం బయ్యారంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెరువుకు సీతారామా ప్రాజెక్టు నీటిని తీసుకొస్తామని పలు మార్లు హామీ ఇచ్చి, కుట్రలకు దిగుతున్నారన్నారు. చెరువు అభివృద్ధి కోసం తమ సంఘం ఆధ్వర్యంలో రైతులతో కలిసి ఉద్యమిస్తామన్నారు. సమావేశంలో నాయకులు సురేష్, ఉదయ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

'మా' అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ పట్టణంలోని రైల్వే స్టేషన్ ఎదురుగా మథర్ థెరిస్సా సెంటర్ నందు గల గౌసియా మసీదులో శుక్రవారం సాయంత్రం 6:15 నిమిషాల ప్రార్థన అనంతరం మా అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డుపల్లి ఉపేంద్రం ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మా అసోసియేషన్ అధ్యక్షులు బొడ్డుపల్లి ఉపేంద్రం, అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు, దళితరత్న కామ సంజీవరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి, ఉషోదయ వాకర్స్ అధ్యక్షులు పాలబిందెల మల్లయ్య, బీఆర్‌ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిట్యాల జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.